ప్రతి రైతుకు నష్టపరిహారం

- కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్
- ఆర్బీకేల్లో ధాన్యం కొనగోలు కేంద్రాల ఏర్పాటు
- మద్దతు ధరకు ధాన్యం విక్రయించేందుకు అకాశం
- పలు గ్రామాల్లో నేలవాలిన పంట పొలాల పరిశీలన


కొల్లిపర మండలంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్/కొల్లిపర: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతు పేరును వ్యవసాయాధికారులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. తెనాలిలోని పెదరావూరు, బుర్రిపాలెం, కొల్లిపర మండలం చక్రాయపాలెం, జెముదుపాడు, దావులూరు, తూములూరు, పాతబొమ్మువానిపాలెం, కొల్లిపర గ్రామాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వ్యవసాయాధికారులతో కలసి పంట నష్టం జరిగిన పొలాలను ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న వరి, మినుము పొలాలు, అరటి తోటలను సందర్శించారు. కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రైతులు పంట పొలంలోని వర్షం నీరు బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైన పంట కాలువల్లో నీరు బయటకు రాని చోట ఉపాధి హామీ, జల్ మిషన్ ద్వారా కాల్వలను వెంటనే బాగు చేయాలని సూచించారు. వీలు కాని చోట ఆయిల్ ఇంజన్‌ల ద్వారా నీరును బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరో మూడు రోజుల్లో ప్రతి రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. కేంద్రాల వద్ద ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. తుపాను కారణంగా జిల్లా మొత్తం లక్ష ఎకరాల్లో వరి, 20వేల ఎకరాల్లో మినుము, 26వేల ఎకరాల అరటి, మిరప పంటలకు నష్టం జరిగినట్లు తెలిపారు.

నిత్యం గ్రామాల్లోనే..

ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తుపాను ప్రభావం తగ్గినప్పటి నుంచి తనతో పాటు మూడు రోజుల నుంచి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతి గ్రామంలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపారు. నష్టం జరిగిన ప్రతి రైతుకు పరిహారం త్వరలోనే అందిస్తామని, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ఆయా గ్రామాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే మురుగు కాల్వలు, డొంక రోడ్లను పరిశీలించారు. అవసరమైన చోట వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తెనాలి, కొల్లిపర ఎంపీపీలు చెన్నకేశవులు, భీమవరపు పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ ఉషారాణి, జిల్లా ఉద్యానశాఖాధికారి రవీంద్రబాబు, ఏఓ వెంకటరావు, ద్వామా పీడీ వెంటరామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజకుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ ఉషా, ఎంఈవో చిన్నామ్మాయి, దావులూరు వీఏఏ బంగారుబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొమ్ము శ్రీనివాసరెడ్డి, పార్టీ మండలాల కన్వీనర్లు చెన్నుబోయిన శ్రీనివాసరావు, అవుతు పోతిరెడ్డి, తహసీల్దార్లు కె. రవిబాబు, జి.నాంచారయ్య, ఎంపీడీవో వి.వి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలిటౌన్: పట్టణం, రూరల్ గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ కోతలు విధిస్తున్నామని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓటు ఆవశ్యకత తెలుసుకోండి



తెనాలిఅర్బన్: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, దాని విలువను అందరూ తెలుసుకోవాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. కళాశాలలో ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఓటు నమోదు చేసుకునే విధానం, ఉపయోగించే విధానాన్ని పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు విశ్రాంతమ్మ తెలియజేశారు. సమావేశంలో ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత, విద్యార్థినులు, ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసి దళార్చన



తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో కార్తిక మాస ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఉదయం సుప్రభాత సేవ, అనంతరం విశ్వక్సేన పూజ నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం చేశారు. అర్చకులు టి.రఘు ఆధ్వర్యంలో మూలవిరాట్ స్వరూపానికి లక్ష తులసి దళాలతో విశేషంగా పూజ నిర్వహించి, అలంకరించారు. శాస్త్ర పండితులు వేదాంతం మాధవకుమార్ ఆగమ శాస్త్రం ప్రకారం శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరి, అర్చకులు కె.అనంతాచార్యులు, శ్రీధర్, యశ్వంత్, కేశవ కుమార్, రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



తెనాలిఅర్బన్: మానవ హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు పేర్కొన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం మానవ హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు, యువతులపై అనేక దాడులు జరుగుతున్నాయని, వాటిని ఎదుర్కొనే విధంగా తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. యువతులు కుంగుఫూ, కరాటే వంటి వాటిని నేర్చుకోవడం ద్వారా దాడులను ప్రతిఘటించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్స్ కొడాలి శ్రీనివాస్, నన్నపనేని సునీల్, చైన్నెకు చెందిన అధ్యాపకురాలు లత, కుంగ్‌ఫూ మాస్టర్ జానీబాషా పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల సేవ



తెనాలిఅర్బన్: బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని రమా సహిత సత్యనారాయణస్వామి మండపంలో శుక్రవారం సాయంత్రం కొండపి వసుంధర ఆధ్వర్యంలో స్వామివారి ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు గోత్రనామాలత అర్చన, తీర్థప్రసాదాలను అర్చకులు చక్రవర్తి అందజేశారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర అన్నమయ్య సంకీర్తన కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, సభ్యులు అందె బాల చంద్రమౌళి, సూరాబత్తుని కేశవరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: మహిళను దూషించిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంపాలెంలో నివాసం ఉంటున్న మహిళ గురించి గణేష్ అసభ్యకర ప్రచారం చేస్తున్నాడు. గణేష్‌ను ఈవిషయంపై బాధిత మహిళ ప్రశ్నించింది. దీంతో గణేష్ మహిళను దూషించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యర్థాలను మురుగు కాల్వలో వేయొద్దు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక


పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక,

తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో వ్యర్థాలను వేయడం వల్ల పారుదల నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 23వ వార్డు చంద్రబాబు నాయుడు కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వల షీల్ట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యర్థాలను కాల్వల్లో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తోక శిరీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, తదితరులు ఉన్నారు.

29 నుంచి వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బాలస్వామిజీ,

తెనాలిటౌన్: తెనాలిలోని తాలూకా జూనియర్ కాలేజ్ ఆవరణలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు శ్రీ గోవింద నామ జపయజ్ఞ పూర్ణాహుతి, శ్రీ వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలను సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పూజ్యశ్రీ బాలస్వామిజీ తెలిపారు. గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో వైభోత్సవాలకు సంబంధించి పోస్టర్‌లను బాలస్వామిజీ, ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలస్వామిజీ మాట్లాడుతూ 20 రోజుల పాటు జరిగే వైభోత్సవాల్లో సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు తిరుమల వేద పండితులతో జరుగుతుందని చెప్పారు. మహోత్సవానికి వివిధ పీఠాధిపతులు, స్వామిజీలు, మాతాజీలు, ఆధ్యాత్మిక గురువులు, ప్రవచన కర్తలు విచ్చేస్తారని తెలిపారు. భక్తులతో ప్రతిరోజు సామూహికంగా సహస్ర దళార్చన, శ్రీవారికి లక్ష లడ్డూలతో అర్చన, నివేదన జరుగుతుందని బాలస్వామిజీ తెలిపారు. రోజు సాయంత్రం శృంగేరి శారదా పీఠ ఆస్థాన పండితులు డాక్టర్ బాదంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి ప్రవచనం చేస్తారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ట్రస్ట్ సభ్యులు ఉప్పల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గుడివాడ శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, తటవర్తి రామకృష్ణ, కోజిజేటి శ్రీనివాసరావు, చుండూరు రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

- ఒరిగినవి 210 విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న 55 ట్రాన్స్‌ఫార్మర్‌లు
- మిచాంగ్ తుపాను దెబ్బకు రూ.60లక్షలు నష్టం
- ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి


వివరిస్తున్న ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వలన తెనాలి డివిజన్ పరిధిలో 210 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని, 55 ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయని వాటిని యుద్ధప్రాతిపదికన పునఃరుద్ధరించినట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చిరంజీవి తెలిపారు. చెంచుపేటలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో శనివారం ఆయన వివరాలు తెలియజేశారు. డివిజన్ పరిధిలో 14 సెక్షన్‌లు ఉండగా 150 మంది సంస్థ సిబ్బంది, మరో 150 మంది ప్రైవేట్ సిబ్బందితో తుఫాన్ వలన దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించినట్లు తెలిపారు. తుఫాన్ వలన విద్యుత్ శాఖకు డివిజన్ పరిధిలో రూ.60లక్షలు నష్టం జరిగినట్లు తెలిపారు. అర్ధరాత్రి సమయాల్లో కూడా సిబ్బంది పనిచేసి వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా పూర్తిస్థాయిలో సరఫరా ఇచ్చినట్లు తెలిపారు. దళితవాడలు, కాలనీలో కూడా విద్యుత్‌ను రాత్రి, పగలు పనిచేసి సరఫరా ఇచ్చినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో తెనాలి రూరల్ మండలంలో 20 స్తంభాలు, పట్టణంలో 18, దుగ్గిరాల మండలంలో 14, కొల్లిపరలో మండలంలో 17, కొల్లూరు మండలంలో 18, వేమూరు మండలంలో 13, చేబ్రోలు మండలంలో 23, చుండూరు మండలంలో 14, అమృతలూరు మండలంలో 14, రేపల్లె పట్టణంలో 15, రేపల్లె మండలంలో 32, భట్టిప్రోలు మండలంలో 12 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు ఈఈ తెలిపారు. డివిజన్ పరిధిలో ఇంకా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే ఆయా మండలాల్లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు. సమావేశంలో ఏడీఈలు అశోక్‌కుమార్ (తెనాలి), భాస్కర్ (రేపల్లె) పాల్గొన్నారు.

వార్డు వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతందని చెప్పారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 12న దరఖాస్తుల పరిశీలన, 13న ఇంటర్వ్యూలు, 18న ఎంపికైన వారి జాబితా విడుదలతో పాటు విధుల కేటాయింపు జరుగుతుందన్నారు. అర్హులైన యువతి యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

నందివెలుగులో వికసిత్ భారత్ సమావేశం



తెనాలిటౌన్: నందివెలుగు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వికసిత్ భారత్ యాత్ర సమావేశం నిర్వహించారు. సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో వి.ప్రతాప్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. గ్రామంలో సర్వే పూర్తి అయిన సందర్భంగా వీఆర్వో లక్ష్మికి సర్టిఫికెట్‌ను సర్పంచ్ పవన్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అధికారులు సహకరించాలని, గ్రామాన్ని మోడల్ గ్రామంగా చేయడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో కొలకలూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్‌చంద్రబోస్, ఏపీఎం జయశ్రీ, వీఆర్వోలు కృష్ణమూర్తి, లక్ష్మి, తోటకూర కోటేశ్వరరావు, సామరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెదరావూరులో 'బాబూజీ' చిత్రీకరణ


చిత్రంలోని ఓ సన్నివేశం

తెనాలిరూరల్: 'బాబూజీ' చిత్రంలో మహాత్మా గాంధీ పాల్గొన్న సన్నివేశాలను రూరల్ మండలం పెదరావూరు స్టూడియోలో దర్శకుడు దిలీప్ రాజా శుక్రవారం చిత్రీకరించారు. 'ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర సంగ్రామానికి ప్రతి భారతీయుడి ప్రాణాలను అంకితం చేయాలి. వందేమాతరం' అంటూ గాంధీజీ చెపుతున్న సంభాషణలను చిత్రీకరిస్తున్నట్లుగా స్థానిక విలేకరులకు దిలీప్ రాజా తెలిపారు. గాంధీజీ దగ్గర స్వాతంత్ర ఉద్యమంలో బాబూ జగ్జీవన్ రామ్ శిష్యరికం చేసిన సన్నివేశాల రూపకల్పన చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బాబూ జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను 'బాబూజీ' టైటిల్ తో బయోపిక్ గా తెనాలి పరిసర ప్రాంతాల్లో రూపొందిస్తున్న విషయం తెలిసిందే! గాంధీజీ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని కారాగారానికి వెళ్లగా జగ్జీవన్ రామ్ కూడా జైలుజీవితం గడిపిన సన్నివేశాలను ఇప్పటికే చిత్రీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. గాంధీజీ పాత్రను కేఆర్.డి.శెట్టి పోషిస్తుండగా లాల్ బహదూర్ శాస్త్రి పాత్రలో ఉత్తర ప్రదేశ్ నటుడు అమీర్ చోద్రి, జగజ్జీవన్ రామ్ గా మిలటరీ ప్రసాద్, గాంధీజీ వెంట నిరంతరం ఉండే శిష్యురాలు 'మను' పాత్రలో పూజ కటారి, గూడెం పెద్దగా చదలవాడ హరిబాబు నటిస్తున్నారు. కెమెరా వంశీ, ఎడిటర్ నందమూరి హరి, నిర్మాత ఆలూరి సుందర రామయ్య కాగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం దిలీప్ రాజా.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన అజెండా

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- 13, 30, 31 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం


30వ వార్డు సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 13వ వార్డు చినరావూరు-3 సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వీటినందించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక చేయూతను ఇచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ తెనాలి క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, కౌన్సిలర్ కుర్రా సుజాత మాట్లాడుతూ 13వ వార్డులో ఇప్పటి వరకు రూ.23.22కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, కుర్రా శ్రీను, మేనేజర్ అప్పలరాజు పాల్గొన్నారు.

30వ వార్డు పరిధిలోని ఉడా కాలలలోని సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. 30వ వార్డులో ఇప్పటి వరకు రూ.20.30 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు కౌన్సిలర్ కొమ్మరబత్తుని జయపాల్ చెప్పారు. సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డులను, బుక్‌లెట్‌ను ఆమె ఆవిష్కరించారు. సమావేశంలో కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు పాల్గొన్నారు.

+ 31వ వార్డుల పరిధిలోని చెంచుపేటలోని కోగంటి శివయ్య హైస్కూల్ వద్ద వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 31వ వార్డులో ఇప్పటి వరకు రూ.22.56 కోట్లతో సంక్షేమాన్ని అందించినట్లు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసరెడ్డి చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో.. సకల సౌకర్యాలు

- రూ.35 లక్షలతో కేశ ఖండనశాల, పొంగలి షెడ్డు నిర్మాణం
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శివకుమార్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, చైర్మన్ సాయిబాబు

తెనాలి: చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తెనాలిలోని వైకుంఠపురంలో గల శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం పవిత్రతను కాపాడుతూ భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. వైకుంఠపురం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కేశ ఖండనశాల, పొంగలి షెడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే శివకుమార్ శంకుస్థాపన చేశారు. దేవస్థానంలో పొంగలి షెడ్డు, కేశ ఖండనశాలకు 1984లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే శివకుమార్ తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ శంకుస్థాపన చేసి, 1987లో ప్రారంభోత్సవం చేశారు. అవి ప్రస్తుతం పాడుబడటంతో వాటి స్థానంలో నూతన నిర్మాణాలకు కుంభం సాయిబాబు అధ్యక్షుడిగా గల నూతన పాలకవర్గం శ్రీకారం చుట్టింది. రూ.35 లక్షలతో నిర్మిస్తున్న కేశ ఖండనశాల, పొంగలి షెడ్డు నిర్మాణాలకు పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తెనాలిలో ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న వైకుంఠపురంలో తన తండ్రి అప్పట్లో చేసిన నిర్మాణాలను ఇప్పుడు తాను ఆధునీకరించడం సంతోషంగా ఉందన్నారు. వెంటనే నిర్మాణ పనులను ఆరంభించి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు కుంభం సాయిబాబు, ఆలయ సహాయ కమిషనర్/ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు, పాలకవర్గ సభ్యులు బొద్దులూరి లక్ష్మీసరస్వతి, దేవరకొండ వెంకటరమణ, కురగంటి సునీత, బట్టు దుర్గారావు గురుస్వామి, ముంత దుర్గా ప్రసాద్, కనికిచర్ల చరణ్ రత్నసందీప్, వంగల జగదీశ్వరి, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

10న ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఎస్.హెచ్.ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ తాతా సేవ కుమార్, పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక 2/1 బ్రాడీపేటలోని ఎస్ హెచ్ ఓ భవనంలో ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ డి .అమర్ పాల్గొంటారన్నారు.

రూ.40 లక్షలు ఖరీదు చేసే 150 మొబైల్‌ఫోన్లు అప్పగింత

బాధితుల్లో ఆనందం


మొబైల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనాథ్

నగరంపాలెం: సెల్‌ఫోన్ పోగొట్టుకుని ఫిర్యాదు చేసే ప్రతి ఒక్కరికీ తిరిగి వారి మొబైల్ ఫోన్లను అప్పగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సుమారు రూ.40 లక్షలు ఖరీదైన వివిధ బ్రాండెడ్ సెల్ కంపెనీల 150 మొబైల్ ఫోన్లను శుక్రవారం బాధిత ఫిర్యాదిదారులకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో అప్పగించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం ఈ ఏడాది మొదట్లో పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు లేకుండానే పెద్దఎత్తున మొబైల్‌ఫోన్లను వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, బాధితులకు అప్పగిస్తున్నామని చెప్పారు. పలుమార్లు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు వెళ్లి కూడా ఫోన్లను రికవరీ చేసి అప్పగించామని అన్నారు. ఇటీవల మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను సైతం తీసుకొచ్చి అందజేశామని తెలిపారు. ఈ వాట్సాప్ నంబర్‌ను గుంటూరు జిల్లాతోపాటు ఇతరత్రా జిల్లాల ప్రజలు సైతం పోలీస్ మొబైల్ వాట్సాప్ నంబర్, సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్లల్లోని సమాచారం దుర్వినియోగం కాదని, తద్వారా సెల్‌ఫోన్లు బ్లాక్ అవుతాయని అన్నారు. అదే విధంగా పోగొట్టుకున్న ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. పలువురు ఫోన్లను తీసుకున్న బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం టీఏడబ్ల్యూ (టెక్నికల్ అనాలిసిస్ వింగ్), ఐటీ కోర్ బృంద సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, ఆర్ఐ రాజారావు, ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో రౌడీషీటర్ దాడి

- ఆరు రోజుల వ్యవధిలో రెండోసారి
- పోలీసుల కనుగప్పి తిరుగుతున్న వైనం

తాడేపల్లిరూరల్: విజయవాడ పటమటకు చెందిన రౌడీషీటర్ కిరణ్ ఓ యువకుడిపై శుక్రవారం దాడిచేసి కత్తితో పొడిచాడు. పోలీసులు కథనం.. తాడేపల్లి బైపాస్‌రోడ్ మదర్‌థెరిస్సా కాలనీలో వనపర్తి బుజ్జిపై రౌడీ షీటర్ కిరణ్ తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట అందరూ చూస్తుండగా బ్లేడ్ వంటి ఆయుధంతో గాయపరిచి పరారయ్యాడు. బుజ్జికి బావ వరుస అయిన విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన ఆటోడ్రైవర్ బాలసాని తిరుపతిరావు పోలీసులకు సహకరిస్తున్నాడని అనుమానం వచ్చింది. శుక్రవారం తన ప్రియురాలైన బుజ్జితో కలసి ఆటోడ్రైవర్ తిరుపతిరావు, విజయవాడ నుంచి బుజ్జి నివాసముంటున్న మదర్ థెరిస్సా కాలనీకి వచ్చారు. బుజ్జి ఇంట్లోకి వెళుతుండగా ఆటోలో కూర్చున్న బుజ్జి బావ తిరుపతిరావుతో కిరణ్ నా ప్రియురాలితో ఏం పనిరా అంటూ, పోలీసులకు నాగురించి చెబుతున్నావా అంటూ దాడికి పాల్పడ్డాడు. తిరుపతి రావు భయంతో ఇంట్లోకి పరిగెడుతున్నా కత్తితో వీపుపై, పొట్టపై దాడిచేసి కిరణ్ పరారయ్యాడు. గాయపడిన తిరుపతిరావును స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆటోడ్రైవర్ తిరుపతిరావు ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉన్నట్లు బంధువులు తెలిపారు. విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న కిరణ్ గతంలో పటమటలో తనతో చదువుకున్న మహిళతో పాటు కొంతమందిపై ఇదే విధంగా దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కిరణ్ ప్రియురాలు అయిన బుజ్జికి 12 సంవత్సరాల బాలిక ఉంది. ఆ బాలికను అమ్మేసే ప్రయత్నం చేయడంతో బుజ్జికి, కిరణ్‌కు మధ్య వివాదం ఏర్పడడం, బుజ్జిని చంపి ఆ చిన్నారిని తీసుకు వెళ్లి అమ్మేయాలని ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆటో డ్రైవర్ బాలసాని తిరుపతిరావుపై జరిగిన దాడిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.